
# నాకౌట్ రేసులో పంజాబ్ డీలా

## పోతూపోతూ దెబ్బతీసిన ఢిల్లీ క్యాపిటల్



ధర్మశాల,మే18(ఆర్ఎన్ఎ): నాకౌట్ రేసు నుంచి ఈపాటికే అవుటైనా ఢిల్లీ క్యాపిటల్స్ పోతూపోతూ పంజాబ్ కింగ్స్‌కు ఝలక్ ఇచ్చింది. ఐపీఎల్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 15 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచింది. కీలకమైన మ్యాచ్‌లో ఓడడంతో పంజాబ్ ప్లేఆఫ్స్ ఆశలకు గట్టిదెబ్బ తగిలింది. ఈ మ్యాచ్ గెలిచి ఉంటే పంజాబ్‌కు ఆశలు మిగిలేవి. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 2 వికెట్లకు 213 పరుగులు చేసింది. రిలీ రొసో (37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సలతో 82 నాటౌట్), పృథ్వీ షా (38 బంతుల్లో 7 ఫోర్లు, సిక్సర్‌తో 54) హాఫ్ సెంచరీలు సాధించగా.. వార్నర్ (46) మెరిశాడు. ఛేదనలో పంజాబ్ ఓవర్లన్నీ ఆడి 198/8 స్కోరు మాత్రమే చేసింది. లివింగ్‌స్టోన్ (48 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సలతో 94), అథర్వ (55) శ్రమ వృథా అయింది. ఇషాంత్, నోకియా చెరో 2 వికెట్లు తీశారు. రొసోకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. లివింగ్‌స్టోన్ తుది వరకు పోరాడినా.. అతడికి తగిన సహకారం లభించకపోవడంతో పంజాబ్‌కు ఓటమి తప్పలేదు. అథర్వ, లివింగ్‌స్టోన్ మూడో వికెట్‌కు 78 పరుగులతో జట్టును మ్యాచ్‌లోనే ఉంచినా.. కీలక సమయంలో మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. భారీ ఛేదనలో ఓపెనర్ ధవన్ (0)ను ఇషాంత్ డకౌట్ చేశాడు. కానీ, మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (22), అథర్వ రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. నాలుగో ఓవర్‌లో ఇషాంత్ బౌలింగ్‌లో సిమ్రన్ హ్యాట్రిక్ ఫోర్లతో బ్యాట్ ఝుళిపించగా.. ఆ తర్వాత అథర్వ రెండు ఫోర్లు, రెండు సిక్సలు బాదడంతో పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ 47/1తో నిలిచింది. అయితే, అక్షర్ బౌలింగ్‌లో భారీషాట్ ఆడే క్రమంలో ప్రభ్‌సిమ్రన్ క్యాచవుటయ్యాడు. ఈ దశలో స్పిన్నర్లు అక్షర్, కుల్దీప్ కట్టుదిట్టంగా బంతులేయడంతో స్కోరు వేగం మందగించింది. 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కుల్దీప్ బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్ ఇచ్చిన క్యాచ్‌ను నోకియా చేజార్చగా.. అథర్వకు యష్ లైఫ్ ఇచ్చాడు. కాగా, అక్షర్ వేసిన 12వ ఓవర్‌లో అథర్వ రెండు బౌండ్రీలు కొట్టగా.. లివింగ్‌స్టోన్ మరో ఫోర్‌తో జట్టు స్కోరును సెంచరీ మార్క్ చేర్చాడు. డబుల్‌తో అథర్వ అర్ధ శతకం పూర్తి చేసుకున్నా.. 14వ ఓవర్‌లో కుల్దీప్ 5 పరుగులు మాత్రమే ఇచ్చి ఒత్తిడి పెంచాడు. చివరి 5 ఓవర్లలో 86 పరుగులు కావాల్సి ఉండగా.. అథర్వ రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన జితేష్ (0), షారుక్ ఖాన్ (6) వేగంగా పెవిలియన్ చేరారు. అయితే, పట్టువదలని లివింగ్‌స్టోన్ శివాలెత్తడంతో సమీకరణం 12 బంతుల్లో 38 పరుగులకు దిగి వచ్చింది. దీంతో గెలుపుపై ఆశలు రేకెత్తిన సమయంలో కర్రాన్ (11), హర్‌ప్రీత్ బ్రార్ (0) వరుసగా అవుట్‌కాగా.. చివరి ఓవర్‌లో జట్టు విజయానికి 33 రన్స్ అవసరమయ్యాయి. ఉత్కంఠ మధ్య ఇషాంత్ బౌలింగ్‌లో 17 రన్స్ మాత్రమే సాధించిన లివింగ్‌స్టోన్ ఆఖరి బంతికి అవుటయ్యాడు.

# ఫెడ్కప్‌లో జ్యోతికి స్వర్ణం



హైదరాబాద్,మే18(ఆర్ఎన్ఎ): ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ అథ్లెట్ యర్రాజీ జ్యోతి స్వర్ణం కొల్లగొట్టింది.రాంచీలో జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి 12.89 సెకన్లలో రేసును పూర్తి చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో ముందురోజు హీట్స్‌లో తాను నెలకొల్పిన 13.18 సెకన్ల జాతీయ రికార్డును జ్యోతి మెరుగుపరచుకుంది. ఈ ప్రదర్శనతో జూలై 12 నుంచి 16 వరకు బ్యాంకాక్‌లో జరిగే ఆసియా అ÷-లథెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు జ్యోతి అర్హత సాధించింది. ఇక, నిత్య రామ్‌రాజ్ (తమిళనాడు 13.44 సె)కు రజతం, సప్నా కుమారి (జార్ఖండ్ 13.58 సె)కు కాంస్యం దక్కాయి.

# ఐదేళ్ల తరవాత పాక్,భారత్ ఫుట్‌బాల్



న్యూఢిల్లీ,మే18(ఆర్ఎన్ఎ): ఐదు సంవత్సరాల విరామం తర్వాత భారత్,పాకిస్థాన్ ఫుట్‌బాల్ జట్లు పరస్పరం ఢీకొనున్నాయి. వచ్చేనెల 21 నుంచి బెంగళూరులో జరిగే సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ (శాఫ్) కప్‌లో రెండు జట్లు గ్రూపు 'ఎ'లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈ మేరకు ప్రకటించిన డ్రా ప్రకారం..డిఫెండింగ్ చాంపియన్ భారత్, పాక్‌తోపాటు కువైట్, నేపాల్ ఒకే గ్రూపులో తలపడనున్నాయి. లెబనాన్, మాల్దీవులు, బంగ్లాదేశ్, భూటాన్ గ్రూపు 'బి'లో ఉన్నాయి.

## ఆర్చరీ టీమ్స్‌కు వరల్డ్‌కప్ స్టేజ్-2లో చుక్కెదురు

షాంఘై,మే18(ఆర్ఎన్ఎ): ఇండియా ఆర్చరీ మెన్స్, విమెన్స్ కాంపౌండ్ టీమ్స్‌కు.. వరల్డ్‌కప్ స్టేజ్-2లో చుక్కెదురైంది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో జ్యోతి సురేఖ,అదితి స్వామి,అవ్నీత్ కౌర్‌తో కూడిన ఇండియా విమెన్స్ టీమ్ 228-231తో టర్కీ చేతిలో ఓడింది. ఒజాస్ డియోటలే-రిషబ్ యాదవ్,ప్రథమేష్ జ్వాకర్‌తో కూడిన ఇండియా మెన్స్ టీమ్ 231-234 స్కోరుతో మెక్సికో చేతిలో కంగుతిన్నది. అయితే మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒజాస్‌జ్యోతి సురేఖ ఇంకా రేసులోనే ఉన్నారు. రికర్వ్ క్వాలిఫికేషన్స్‌లో ఇండియా విమెన్స్ ఆర్చర్లు సత్తా చాటారు. సిమ్రన్‌జీత్ కౌర్ (648), భజన్ కౌర్ (638), అంకితా భాకట్ (630) వరుసగా 7, 17, 24వ స్థానాల్లో నిలిచారు. టీమ్ ఈవెంట్‌లో తొలి రౌండ్‌లో బై లభించడంతో ఇండియా డైరెక్ట్‌గా ప్రిక్వార్టర్స్ బరిలోకి దిగనుంది. మెన్స్ రికర్వ్ క్వాలిఫికేషన్‌లో బొమ్మదేవర ధీరజ్ (656) 13వ ప్లేస్‌లో నిలవగా, అటాను దాస్ (638), నీరజ్ చౌహాన్ (638) వరుసగా 44, 47వ స్థానాలకు పడిపోయారు. తరుణ్‌దీప్ రాయ్ 631 పాయింట్లతో 57వ స్థానంలో నిలిచి పోటీకి దూరమయ్యాడు.




# సినిమాకోసం యాంకరింగ్ వదలను

## మనసులో మాట బయటపెట్టిన రష్మీ



బుల్లితెర స్టార్ యాంకర్స్ రష్మీ గౌతమ్ జబర్దస్త్ కామెడీ షో ద్వారా ప్రేక్షకులకు దగ్గరైంది. ఈ బ్యూటీ. అంతకు ముందు కూడా తెలుగులో చాలా సినిమాల్లోనే నటించింది కానీ.. జబర్దస్త్ ఆమెకు ఫుల్ క్రేజ్ తెచ్చిపెట్టింది. నిజానికి రష్మీకి సినిమాలన్నా, నటన అన్నా చాలా ఇష్టం. జబర్దస్త్ లో ఎంత బిజీగా ఉన్నా.. అడపాదడపా సినిమాలు చేస్తూనే ఉంది. అయితే ఈ బ్యూటీ.. తాజాగా ఒక నిర్ణయం తీసుకుందట. అదేంటంటే.. ఆమె అనసూయాలా టీవీ కెరీర్ ని ఆపేసి సినిమాల్లో చేయాలని అనుకోవడం లేదట. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈమేరకు స్పందించింది.. ' ఇందులో భాగంగా అనసూయ చేసిన తప్పు నేను చేయనని చెప్పుకొచ్చింది. నాకు సినిమాల్లో చేయడం ఇష్టమే కానీ దానికోసం టీవీ రంగాన్ని వదిలేయలేను అని క్లారిటీ ఇచ్చింది. ఇప్పటికే జబర్దస్త్ నుండి కానీ.. వేరే షోల నుండి కానీ బయటకు వెళ్లిన వాళ్ళు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో నేను చూస్తున్నాను. అందుకే నేను అలాంటి పనిచేయను అను చెప్పుకొచ్చింది రష్మీ. ఇక ఈ వీడియో చూసిన చాలా మంది రష్మీ, అనసూయను దృష్టిలో పెట్టుకొనే ఆ వ్యాఖ్యలు చేసింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అనసూయ సినిమాల చేయడం కోసం జబర్దస్త్ షో వదిలేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమెకు సినిమాల్లో సరైన అవకాశాలు లేవు. అందుకే మల్లి జబర్దస్త్ లోకి రావడానికి ట్రై చేస్తున్నా.. మ్లలెమాల టీమ్ దానికి ఒపుకోవడంలేదట. ఇది గమనించిన రష్మీ.. సినిమాల కోసం టీవీ రంగానికి దూరం కాకూడదు అని ఫిక్స్ అయిందట.

# పుష్ప-2 నుంచి క్రేజీ అప్‌డేట్

## షెకావత్ పార్ట్ పూర్తి చేసినట్లు మేకర్స్ వెల్లడి



పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా.. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన చిత్రం 'పుష్ప' సినిమా నెలకొల్పిన రికార్డుల గురించి.. కలెక్షన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'పుష్ప' సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులపై చూపించిన ఇంపాక్ట్ అంతా ఇంతా కాదు. పుష్ప రాజ్ అనే క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసి ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు సుకుమార్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి సీక్వెల్ 'పుష్ప: ది రూల్' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. రీసెంట్‌గానే 'హంట్ ఫర్ పుష్ప' అంటూ.. 3 నిమిషాల 17 సెకన్ల నిడివి ఉన్న వీడియోని వదలగా.. అది వ్యూస్, లైక్స్ పరంగా సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. హంట్ ఫర్ పుష్ప'తో అమాంతం అంచనాలను పెంచేసిన టీమ్.. ఇప్పుడు 'పుష్ప 2' షూటింగ్ అప్‌డేట్స్ వదులుతూ.. ఈ సినిమా నిత్యం వార్తలలో ఉండేలా చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో 'భన్వర్ సింగ్ షెకావత్' అనే పోలీస్ అధికారిగా చేసిన ఫహద్ ఫాసిల్ కు సంబంధించిన అప్‌డేట్‌ను మేకర్స్ తెలియజేశారు. పుష్ప2లో భన్వర్ సింగ్ షెకావత్‌గా చేస్తున్న ఫహద్ ఫాసిల్ సన్నివేశాలకు సంబంధించి ఓ కీలక షెడ్యూల్ ముగిసింది. ఈసారి అతని ప్రతీకారం మాములుగా ఉండదు' అని తెలుపుతూ లోకేషన్‌లో ఉన్న పిక్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం వచ్చిన ఈ అప్‌డేట్‌తో మరోసారి 'పుష్ప'ట్యాగ్ సోషల్ మీడియాలో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సినిమా కోసం ఎంతగానో వేచి చూస్తున్నట్లుగా నెటిజన్లు రియాక్ట్ అవుతున్నారు. మరీ ముఖ్యంగా ఇందులో ఎటువంటి మ్యానరిజమ్స్‌ని ఐకాన్ స్టార్ ప్రదర్శించ బోతున్నాడో.. అనేలా టాక్ నడుస్తోంది. అల్లు అర్జున్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో ధనుంజయ, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు ఇతర పాత్రలలో నటిస్తున్నారు. ఈ పార్ట్‌లో విలక్షణ నటుడు జగపతిబాబు కూడా కీలక పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in